క్లుప్తంగా

భక్తిగీతాల కచేరి

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నల్లకుంటలోని శృంగేరి శంకర మఠం ప్రాంగణంలో భక్తి గీతాల కచేరి ఉంటుందని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి బుధవారం ప్రకటించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు, టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి శిష్యబృందం భక్తిగీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. వసంత పంచమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పాల్గొనే సంగీతాభిమానులు కోవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు.

జాతీయ సదస్సుకు హాజరైన మధుసూదన్

అంబర్‌పేట: ప్రాథమిక విద్యా సంస్కరణల అంశంపై జాతీయస్థాయిలో జరిగిన సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మధుసూదన్ హాజరయ్యారు. ఇటీవల ఢిల్లీలో సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాహక్కు సంస్కరణలపై చర్చించడం జరిగిందని ఆయన బుధవారం ప్రకటించారు. ఎన్ఈపీ 2020 లక్ష్యాలను చేరేందుకు పలు అంశాలపై చర్చించామన్నారు. సీబీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ జోసెఫ్ ఇమాన్యుయల్, ఐఏఎస్ అధికారి ఆయుష్‌ప్రసాద్‌తో పాటు పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.

అనాథల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ

కాచిగూడ: రాష్ట్రంలోని అనాథల ఆస్తులు, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర అనాథ హక్కుల పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు బొక్క వెంకటయ్య అన్నారు. కొన్ని జిల్లాల్లో తహసీల్దార్, ఆర్డీఓ అధికారులు మీసేవ ద్వారా అనాథ ధ్రువీకరణ పత్రం, ఐడీ కార్డు ఇవ్వడానికి గత 23 ఏళ్లుగా తాను ప్రాణాలకు తెగించి చేసిన పోరాటాల ఫలితంగా గతంలో 2010లో దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జీవో ఎంఎస్- 47 ద్వారా అన్ని రెసిడెన్సియల్స్‌లో 3 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలపై స్పందించి అనాథలను ఆదుకుని పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు.

బాలికల విద్య ప్రగతికి మెట్లు

ముషీరాబాద్: బాలికల విద్యే ప్రగతికి మెట్లు అని డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, లయన్స్ కృష్ణవేణి, స్వరూపారాణిలు అన్నారు. జాతీయ బాలికాదినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బాలికలు ఆరోగ్యంగా ఉండటం కోసం డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్, ప్రకృతి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ముషీరాబాద్ రైయిన్ బో హోమ్‌లో విటమిన్ టాబ్లెట్లు, పోషకాహారం, పుస్తకాలను అందజేశారు. బాలికలు చదువుకుంటే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. నవభారత లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, అధ్యక్షుడు గోపాలకృష్ణ, రమణమ్మ, సదాలక్ష్మి, వరలక్ష్మి తదితరులున్నారు.

కుల సంఘాల కేలండర్ల ఆవిష్కరణ

చిక్కడపల్లి: పద్మశాలీలు రాజకీయం, సామాజికం, ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం అశోక్‌నగర్ చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ముషీరాబాద్ పద్మశాలి ప్రజా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, కార్యదర్శి నర్సింగరావు, టీఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్, సంఘం కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాజ్‌మోహన్, రాజు, బింగి, నవీన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీను, వాసు, బల్ల ప్రశాంత్, శివ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్, మారిశెట్టి నర్సింగ్, కుమారస్వామి, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్య ముషీరాబాద్ కన్వీనర్ బోనం బన్నీ గ్రేటర్ యువజన అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో 2023 నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు బోనం ఉర్మిళ పాల్గొని కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు



నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక వద్ద పైపులైన్ లీకేజీలతో గత కొంతకాలంగా తాగునీరు కలుషితమవుతోంది. స్థానికులు ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆమె బుధవారం లీకేజీలు ఏర్పడిన ప్రాంతంలో పర్యటించారు. జలమండలి అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజేబాబు, నాయకుడు ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

- వారం రోజుల్లో ఐదు వేల మందికి కంటి పరీక్షలు
- 1500 మందికి కళ్లజోళ్లు
- 670 మందికి ఆపరేషన్లు



కంటిపరీక్ష కేంద్రం వద్ద ప్రజలు

ముషీరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం ముషీరాబాద్ నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతోంది. పేదలకు కంటివైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన ఎనిమిది సెంటర్లలో నిత్యం కంటిపరీక్షలు కొనసాగుతున్నాయి. వందలాది పేద, మధ్యతరగతి ప్రజలకు కంటిపరీక్షలు నిర్వహణ, మందులు, కళ్లద్దాల పంపిణీ కొనసాగుతోంది.

◆ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు సెంటర్లలో గత 6రోజుల వ్యవధిలో వైద్యనిపుణులు 4173 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు.

◆ రోజూ సెంటర్‌లో 100 నుంచి 150 మందికి కంటిపరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి 4173 మందికి కంటిపరీక్షలు నిర్వహించిన వైద్యులు 1427 మందికి కళ్లజోళ్లు, 669 మందికి కంటిఆపరేషన్లు అవసరమని గుర్తించారు.

గందరగోళానికి తావులేకుండా..

◆ కంటివెలుగు సెంటర్‌లలో గందరగోళానికి తావులేకుండా క్రమపద్ధతిలో పేదలకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్నారు. 6 మున్సిపల్ డివిజన్‌లలో మొత్తం 8 కంటివెలుగు పరీక్షా కేంద్రాల్లో కంటి పరీక్షలు కొనసాగుతున్నాయి.

◆ క్యూ లైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది, ఆశావర్కర్స్, కూపన్లను జారీ చేసి వారికి సమయాన్ని నిర్దేశిస్తున్నారు.

◆ ఒక్కో వార్డు కంటివెలుగు సెంటర్‌లో రోజుకు 60-150 మంది వరకు పరీక్షలు చేయించుకుంటున్నారు. వైద్య శిబిరంలో కళ్లల్లో శుక్లం, మోతియ, బిందువు, పొర, నల్లపాప మీద పొర, నరం బలహీనత అంధత్వం, నీటతి కాసులు, కంటిచూపులో లోపాలు తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అంబర్‌పేట: కంటివెలుగు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం పటేల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రాలివే..

డివిజన్ పేరు	కంటి పరీక్షా కేంద్రం పేరు	ఇన్‌చార్జ్ అధికారి	వైద్యాధికారి
1. అడిక్‌మెట్	అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్	ఎం.విశ్వేష్‌నాయక్ ఎఈ	డాక్టర్ కౌసర్‌నజీమ్
2. రాంనగర్	సైబర్‌హుడ్ కమ్యూనిటీహాల్	మురళీకృష్ణ ఎఈ	డాక్టర్ వసంత్‌కుమార్
3. ముషీరాబాద్	మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్	మురళీకృష్ణ ఎఈ	డాక్టర్ నివాస్
4. ముషీరాబాద్	ముషీరాబాద్ వాలీబాల్ ప్లే గ్రౌండ్	మురళీకృష్ణ ఎఈ	డాక్టర్ మౌనిక
5. భోలక్‌పూర్	తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్	సుభాష్ ఎఈ	డాక్టర్ శ్రీనివాస్
6. భోలక్‌పూర్	మదర్సా మదినా స్కూల్	సుభాష్ ఎఈ	డాక్టర్ శృతి
7. గాంధీనగర్	జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్	అబ్దుల్ సలాం ఎఈ	డాక్టర్ బి. అవంతి
8. కవాడిగూడ	ఏవీ కళాశాల, దోమలగూడ	బి.సుబ్బయ్య ఎఈ	డాక్టర్ రాజ్యలక్ష్మి

సద్వినియోగం చేసుకోవాలి..



కాలనీ సభ్యులతో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞాన కేంద్రం: పేదలకోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని నైబర్‌హుడ్ కమ్యూనిటీహాల్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న జీవన విధానంతో కళ్ల సమస్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని వీటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. నైబర్‌హుడ్ కాలనీ అధ్యక్షుడు కిరణ్, ఈఎస్‌టీ డాక్టర్‌రమేష్, డాక్టర్ రమ్య కుమారి, కార్తీక్‌యాదవ్, సత్యనారాయణ, సిద్ధిఖ్, కల్పన, రేఖ తదితరులున్నారు.

బిల్లు వసూలు చేయడంలో అధికారుల జాప్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని జలమండలి సెక్షన్ కార్యాలయ పరిధిలో పలు ప్రాంతాల్లో మొండి బకాయిలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.30 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని ఒక్కో బకాయి రూ.20,000 నుంచి రూ.లక్షకు పైగా బకాయిదారులు ఉన్నట్లు సమాచారం. పేదలపై అధికారులు కనికరం చూపకుండా కనెక్షన్లను కట్ చేస్తున్నారని అధిక మొత్తంలో బకాయిలను వసూలు చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయంపై జోక్యం చేసుకుని బిల్లులు వసూలుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాగ్‌లింగంపల్లిలో 5465 కనెక్షన్‌లు ఉండగా సుమారు రూ.4000 మందికి పైగా బిల్లులు చెల్లంచడం లేదని ఆరోపణలున్నాయి.

బిల్లులు చెల్లించిన వారిపై కొరడా..

◆ చిక్కడపల్లికి చెందిన ఓ వినియోగదారుడి కనెక్షన్ డొమస్టిక్ ఉన్నప్పటికి అధికారుల తప్పిదంతో దాన్ని కమర్షియల్‌గా మార్చి అధిక బిల్లు వేశారని విమర్శలున్నాయి.

◆ ఈ సమస్యను 2017లో అప్పటి జీఎం దృష్టికి తీసుకెళ్లగా.. రూ.10 వేలు కట్టించుకుని డోమస్టిక్ చేస్తామని హామీ ఇచ్చారని ప్రజలు చెబుతున్నారు.

◆ ఐదేళ్ల గడుస్తున్నా కమర్షియల్ నుంచి డోమస్టిక్‌కు మార్చలేదని కొత్తగా వచ్చిన అధికారులు రూ.70 వేలకు పైగా బకాయిలు ఉన్నాయని లేదంటే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు.

◆ ఈ సమస్యను జీఎం దృష్టికి తీసుకెళ్లగా మార్చి వేస్తామని మరో రూ.10 వేలు చెల్లించమని సలహా ఇచ్చారని డబ్బు చెల్లించిన నెల రోజులకే ఆయన బదిలీపై వెళ్లిపోయారన్నారు. సంబంధిత అధికారులు బిల్లు చెల్లించాలని లేదంటే కనెక్షన్ కట్ చస్తామని చెప్పడంతో సదరు బాధితుడు కొత్త జీఎంను సంప్రదించాడు. జీఎంలు మారుతున్నా కనెక్షన్‌ల స్టేటస్ మారడం లేదని చివరకు బిల్లులు చెల్లించినా కనెక్షన్ తొలగించారని సమాచారం.

తప్పుల తడకగా బిల్లులు ...

◆ ప్రతి నెల ఇచ్చే బిల్లులు తప్పుల తడకగా మారుతున్నాయని ఆరోపణలున్నాయి. వందల్లో రావాల్సిన బిల్లులు వేలల్లో వస్తున్నాయి. దీంతో ఆందోళనకు గురైన వినియోగదారులు కార్యాలయానికి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులను ఇచ్చే సిబ్బంది వినియోగదారులకు నేరుగా ఇవ్వకుండా ఇంటి ఆవరణలోనే పారవేస్తున్నారనే ఆరోపణలున్నాయి.





పనులు సకాలంలో పూర్తి చేయాలి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్

కాచిగూడ: అంబర్‌పేట్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్ జమాల్ బస్తీలో రూ.10 లక్షలతో చేపట్టిన తాగునీటి, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. బస్తీలోని పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీఎం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, రాంబాబు, డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్, కె.సదానంద్, దాత్రిక్‌నాగేందర్ బాబ్జీ, మన్నె శ్రీనివాస్‌యాదవ్, దేవిరెడ్డి విజితారెడ్డి, సునిల్ బిడ్లాన్, బి.కృష్ణాగౌడ్, బీజేపీనేతలు సుభాష్ పటేల్, సంతోష్, బీంరాజ్, రవియాదవ్ తదితరులున్నారు.

మహిళ అదృశ్యం



నల్లకుంట: మద్యం మత్తులో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అల్తాపురం అరుంధతి (38) విద్యానగర్ దయానంద్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులను సంప్రదించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమార్తె మంగళవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులంతా ఓటును నమోదు చేసుకోవాలి

చిక్కడపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకుని తమ ఓటును వినియోగించుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీనగర్‌లోని తూనికలు, కొలతలు రాష్ట్ర కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలింగ్ బూత్ కేంద్రం వద్ద జీహెచ్ఎంసీ, బీజేపీ నాయకులతో కలిసి ఆమె ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం ఓటు అని ఓటు హక్కుని వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా కన్వీనర్ ఎం.ఉమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, సాయికుమార్, బీజేవైఎం నాయకులు గోపి, ఆనంద్‌రావు, అభిషేక్, సాయికుమార్, జీహెచ్ఎంసీ అధికారులు రమేష్, సూపర్‌వైజర్ యాదగిరి, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ కొత్త ఓటర్లకు సూచించారు. బుధవారం జాతీయ ఓటర్ల నమోదు దినోత్సవం సందర్భంగా కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఓటరు నమోదు చేసుకున్న కొత్త ఓటర్లు, ఓటుహక్కు కోల్పోయిన వారి నూతన ధృవీకరణపత్రాలను సేకరించి ఓటరు నమోదు అధికారి లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు కార్యక్రమంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్రులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



విద్యార్థులకు అవగాహన దృశ్యం

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తేనే సురక్షితంగా ఇంటికు చేరుకుంటారని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ సంస్థ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. అశోక్‌నగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత నిబంధనలు ఉల్లగిస్తే వారి భవిష్యత్తుకే ప్రమాదం కలిగే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు చెప్పాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, టీటీఐ బేగంపేట ఎస్ఐ జ్యోతి, అబ్దుల్ మజీద్‌ఖాన్, చిరంజీవి, ఆర్.శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

కాచిగూడ: ట్రాఫిక్ నిబంధనలపై కాచిగూడ, నిబోంలిఅడ్డలోని ప్యూనీపాల్స్ హైస్కూల్ విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలను పాటించాలని ఇతరులు కూడా పాటించేలా విద్యార్థులు చూడాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనాలు నడపాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ట్రాఫిక్ టీటీఐ బేగంపేట్ ఏసీపీ శంకర్ రాజు, కాచిగూడ ఎస్సై సురేష్, ట్రాఫిక్ సిబ్బంది కాలేరు క్రిష్ణ, పార్వతి పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ తదితరులున్నారు.


దేవాలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

చిక్కడపల్లి: తెలంగాణలో దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయపునర్నిర్మాణ పనులను చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథంలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి దాదాపు రూ. 2.5 కోట్లకు పైగా దాతల నిధులతో అధునాతనంగా పునర్నిర్మిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు రామకృష్ణ, జీకే రమణ, పద్మాసూర్యప్రకాష్, గణేష్, అర్చకులు వెంకన్న, ఆచారీ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు..

◆ వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం బుధవారం లెక్కించగా రూ.2,21,284 వచ్చిందని పర్యవేక్షణ అధికారి ఈఓ లక్ష్మారెడ్డి, ఆలయ చైర్మన్ మురళీప్రసాద్, ఆంజనేయస్వామి ఈఓ ఎం.దేవనాథం, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో బీఎల్ఎఫ్ పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) భాగస్వామ్య పక్షాలు 119 స్థానాలకు పోటీ చేస్తాయని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో బీఎల్ఎఫ్ ఆవిర్భావసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులు, అనగారిన వర్గాలు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్ష పార్టీలు ఒకే శక్తిగా ఉండి రాజ్యాధికారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కాశీం, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి రవి, బీఎల్ఎఫ్ నాయకులు దండి వెంకట్, పర్వతాలు, మట్టయ్య, వనం సుధాకర్, సిద్ధిరాములు తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని మహిళల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్లు కొంతం దీపిక, సరళ, మహిళా మోర్చా పదాధికారులు, పార్టీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కేంద్ర బడ్జెట్‌లో 70 శాతం నిధులు విద్యకు కేటాయించాలి

కాచిగూడ: ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఓ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని ట్రిబుల్ ఐటీ, ఐఏఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించాలన్నారు. కేంద్రం 6,7,8 తరగతులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను వెంటనే ఇవ్వాలని కోరారు.

